సాక్షి చిత్తూరు

సోమవారం । 25 । ఆగస్టు । 2025



సిద్ధి వినాయకా..బుద్ధి ప్రదాయకా..

కాణిపాకంలో బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. - 8లో



కిక్కిరిసిన బోయకొండ

బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. క్యూలైన్‌లు రద్దీగా మారాయి. - 8లో



తెలుగు వెలుగుకు చర్యలు ..

మహా సంకల్ప దీక్షతోనే తెలుగుకు ప్రాభవం సాధ్యమని తెలుగు రచయితల సమాఖ్య అధ్యక్షుడు పేర్కొన్నారు. - 8లో



పోలీస్ స్టేషన్‌కు తరలించిన టిప్పర్లు (ఫైల్)

అది అన్న తాలుకా బండి..

ముట్టుకుంటే మసైపోతావ్



కూటమి నేతలు అక్రమంగా గ్రావెల్‌ను దోచేస్తున్నారు. నకిలీ బిల్లులతో మాయ చేస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. అనుమతి పేరుతో హద్దులు లేకుండా ఇష్టారాజ్యంగా కొల్లగొడుతున్నారు. అధికార పార్టీ నేతలు కావడంతో అధికారులు, పోలీసులు వాటిపై కన్నెత్తి చూడదంలేదు. ప్రజలు ఇదేమని ప్రశ్నిస్తే ..అది అన్న తాలుకా బండి అంటూ రౌడీలతో బెదిరింపులు, దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

ఓ ప్రజాప్రతినిధి కనుసైగలో అక్రమ క్వారీలు

- నకిలీ బిల్లులతో దందా
- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత
- యథేచ్ఛగా తమిళనాడుకు తరలిపోతున్న గ్రావెల్
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు పట్టుకున్నా వదిలేస్తున్న అధికారులు
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్ ఫోర్స్ : కూటమి పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఓ ప్రజాప్రతినిధి, కూటమి నేతలు విజయపురం మండలంలోని మహారాజపురం సమీపంలోని కొండలో గ్రావెల్‌ను విచ్చలవిడిగా జేసీబీలను పెట్టి టిప్పర్లతో తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు తరలించేస్తున్నారు. మైన్స్ విభాగంలో అనుమతి తీసుకున్నామంటూ గోరంత అనుమతి చూపుతూ కొండంత దోచేస్తున్నారు. నకిలీ బిల్లులతో కొన్ని నెలలుగా గుట్టల్లోని ఎర్ర మట్టిని తీసుకుపోతుంటే స్థానిక ప్రజలు పట్టుకొన్నారు. మండలంలో ఎన్నడూ లేని విధంగా టిప్పర్లలో గ్రావెల్ తరలిస్తుంటే పోలీసు, రెవెన్యూ యంత్రాంగం మాకు సంబంధం లేదంటూ చేతులు ఎత్తేశారు. ప్రజలు అడిగితే ..ఇది అన్న తాలుకా బండి ఎవ్వరైనా ఆపినా...అడిగినా మసైపోతారంటూ బెదిరిస్తున్నారు.

ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికారులు

మండలంలోని మహారాజపురం గ్రావెల్ క్వారీలో ఆరు నెలలుగా గ్రావెల్ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. ఇందులో ఒక ప్రైవేటు వ్యక్తికి 11,800 క్యూబిక్ మీటర్లకు మాత్రమే అనుమతి ఇచ్చారు. తనకు ఇచ్చిన పర్మిట్ గడువు అయిపోయినా..నకిలీ బిల్లుతో గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు వేడుక చూస్తున్నారు. ఒక రోజుకు 1000 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తీసినా 12 రోజుల్లోనే ఇచ్చిన అనుమతులు అయిపోతాయి. రోజుకు వంద టిప్పర్లకు పైగా తరలిస్తూ ఏడాది పాటుగా జరుగుతుంటే ఎన్ని వేల క్యూబిక్ మీటర్ల మేర అనుమతులు లేకుండా దోచేశారో కళ్లకు కట్టినట్లు తెలుస్తోంది. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఇటీవల టిప్పర్‌ను అడ్డుకొని బిల్లులు పరిశీలించగా అవన్నీ నకిలీ అని తేలింది. దీంతో టిప్పర్లను పోలీసు, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అయితే అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి, టిప్పర్లను వదిలివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్వారీ వద్ద తమిళనాడు రౌడీలు

క్వారీ ప్రాంతంలో ఎవ్వరూ పరిశీలనకు వెళ్లకుండా తమిళనాడుకు చెందిన రౌడీలను కాపలా ఉంచారు. టిప్పర్లను ఎవ్వరైన అడ్డుకొన్నా... అక్కడి వారిని నిలదీసినా...రౌడీల చేత బెదిరింపులకు దిగుతుండడంతో స్థానిక ప్రజలను సైతం భయందోళనకు గురి చేస్తోంది. ఇటీవల ఓ వ్యక్తి మహారాజపురం కొండపై జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ప్రశ్నించగా అతడిని రౌడీలు దేహశుద్ధి చేసినట్లు సమాచారం. దీంతో స్థానికులు సైతం ప్రశ్నించడానికి భయపడుతున్నారు.



అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్న స్థానికులు

ప్రశ్నిస్తే.. బెదిరింపులు..దాడులు

నకిలీ బిల్లులతో వెళ్తున్న టిప్పర్లను పట్టుకున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మహారాజపురం క్వారీ నుంచి గ్రావెల్ తరలించేవారిని ఎవరైనా ప్రశ్నిస్తే ఇది ఎమ్మెల్యేకు చెందినవి అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం లారీలను తనిఖీ చేయడానికి భయపడుతున్నారు. ఈ క్రమంలో అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది.



మహారాజపురం కొండలో తవ్వుతున్న గ్రావెల్



గ్రావెల్ తవ్వడంతో రాళ్లతో నిండిన పచ్చని కొండ

ఎస్సీ వర్గీకరణ ఓ కుట్ర

- చంద్రబాబు మాల సామాజిక వర్గంపై కక్ష
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ ధ్వజం



మాట్లాడుతున్న జాతీయ నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఎస్సీ వర్గీకరణ పేరిట దళితుల ఐక్యతను దెబ్బ తీసేందుకు దేశ వ్యాప్త కుట్ర జరుగుతోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ ఆరోపించారు. చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అనేది నరేంద్ర మోదీ చేస్తున్న పెద్ద కుట్ర అన్నారు. ఈ కుట్రలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భాగస్వాములన్నారు. మాల సామాజిక వర్గంపై బాబు పగబట్టి అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కులాన్ని, మతాన్ని రెచ్చగొట్టి ఈ దేశాన్ని విభజించి పనిలో బీజేపీ ఉందని ధ్వజమెత్తారు. రిజర్వేషన్ పేరుతో ఎస్సీల్లో చిచ్చు పెట్టేందుకే వర్గీకరణను తెర పైకి తీసుకొచ్చారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు దేవా, ఉదయ్ కుమార్, సంతోష్ కుమార్, మహాసముద్రం కృష్ణ, బుల్లెట్ బాబు, ఏసు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నేటి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

గంగమ్మా.. కూటమికి మంచి బుద్ధి కల్గించమ్మా

– ఎంపీ విడుదల కావాలని పూజలు, అభిషేకాలు



పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మా.. కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి కల్గించమ్మా .. అంటూ మండలంలోని కాటిపేరి పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ 101 టెంకాయలు కొట్టి మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం పేరిట అభిషేకాలు చేయించారు. అక్రమ కేసు నుంచి ఎంపీ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆకాంక్షించారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీ అంజిబాబు ,పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సింగిల్ విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కళ్యాణ్‌భరత్, సర్పంచ్ సరిత, నాయకులు శ్రీనివాసులు, రంగనాథ్, గంగిరెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి, రాజప్ప, శ్రీకాంత్ ,షంషీర్, చెంగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నరేష్, గణేష్, సాధిక్ తదితరులు ఉన్నారు.



ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

'జాను అనే నేను.. నా స్నేహితురాళ్లు'

వెదురుకుప్పం : ఆడపిల్లలపై సమాజంలో జరుగుతున్న వివక్షపై తిరుగుబాటు చేస్తూ ఓ యువ రచయిత రాసిన నవలను స్త్రీ ప్రపంచానికి అంకితం చేశారు. జాను అనే నేను నా స్నేహితురాళ్లు అనే నవల ద్వారా ఆడపిల్లలపై తల్లిదండ్రులకు ఉన్న చిన్నచూపుపై తన కలం ద్వారా వెలుగెత్తి చాటాడు. వెదురుకుప్పం మండలానికి చెందిన పేట యుగంధర్ రెడ్డి సమాజంలో మగ పిల్లలపై ఉన్న ప్రేమ వాత్సల్యాన్ని ఆడపిల్లలపై చూపడం లేదనే అంశంపై జాను అనే నేను నా స్నేహితురాళ్లు అనే నవలను రాశారు. ఆదివారం సాయంత్రం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ నవలను ఆవిష్కరించారు. ఎస్వీయూ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సదాశివమూర్తి నవలను ఆవిష్కరించారు. ఈ నవలతో పాటు తిరుపతికి చెందిన రచయిత కృష్ణస్వామి రాజు రాసిన మునికష్టడి మాణిక్యం అనే నవలను కూడా ఆవిష్కరించారు. అదే విధంగా ఓరియంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు పేట యుగంధర్ రాసిన జాను అనే నేను నా స్నేహితురాళ్లు పుస్తకానికి సమీక్ష చేశారు. మగ పిల్లలకు ఇచ్చినంత స్వేచ్ఛ ఆడపిల్లలకు ఇవ్వడం లేదని పల్లెల్లో మరింత ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ.. నవలలో జాను చూపిన తెగువ ప్రతి ఆడపిల్లలో ఉండాలన్నారు. కార్యక్రమంలో రచయితలు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఆకుల మల్లేశ్వరరావు, మేఘనాథ్‌రెడ్డి, పల్లిపట్టునాగరాజు, డాక్టర్ లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు.



నవలను ఆవిష్కరిస్తున్న రచయితలు

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

- టీచర్లకు బోధనేతర పనులు అప్పగించడం సరికాదు
- యాదమరిలో యూటీఎఫ్ జిల్లా నాయకులు ధ్వజం



మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

యాదమరి : ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించుకోమని చెబుతూనే వివిధ రకాల బాధ్యతలను అప్పగిస్తూ క్షోభకు గురిచేస్తోందని యూటీఎఫ్ జిల్లా నాయకులు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మండల పరిధిలోని ఓ కళ్యాణ మండపంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ , ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లిస్తామని చెప్పారు. కాని ఇంత వరకు చెల్లించకపోవడంతో ఉద్యోగులు ఆర్థికంగా పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారంలోకి రాగానే పీఆర్సీ అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి పట్టించుకోకపోవడం దారుమణన్నారు. ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని జిల్లా అధ్యక్షుడు సోమశేఖర నాయుడు కోరారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా యూటీఎఫ్ నాయకులు, వక్తలు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనలో గందరగోళం

- డీఎస్సీ అభ్యర్థులకు సమాచారం కరువు
- 25న పరిశీలన ఉందంటూ హంగామా
- సమయం ఇవ్వకుండా పరిశీలన అంటే ఎలా?
- రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ధోరణిపై మండిపాటు



చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ కసరత్తులో సరైన పారదర్శకత లేకపోవడంతో ఈ ప్రక్రియలో తప్పిదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. పలుచోట్ల అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందంటూ లబోదిబోమంటున్నారు. కనీసం వారి సమస్యను విద్యాశాఖ అధికారులు పట్టించుకోని దుస్థితి ఏర్పడుతోంది. పగలంతా సమయం లేనట్టు ఈనెల 22వ తేదీన అర్ధరాత్రి వెబ్‌సైట్‌లో మెగా డీఎస్సీ మెరిట్ జాబితాను అప్‌లోడ్ చేశారు. ఈ ప్రక్రియ అయిన తర్వాత పలువురు అభ్యర్థుల ఫలితాలు తారుమారు అయ్యాయి. మొదట్లో స్కోర్ బోర్డ్ ఫలితాలు ఇచ్చినప్పుడేమో అర్హత సాధించిన అభ్యర్థులు....మెరిట్ జాబితాలు ఇచ్చిన సమయంలో అనర్హులయ్యారు. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పలుచోట్ల జరిగాయి. మెరిట్ జాబితాలు ఇచ్చిన అధికారులు కట్ ఆఫ్ తెలియజేయకపోవడం ఎంపికైన అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. కూటమి ప్రభుత్వం డీఎస్సీని ప్రచార డీఎస్సీగా మార్చుకుంటోంది తప్ప నిరుద్యోగులకు న్యాయం చేసేలా లేదని విద్యావేత్తలు మండిపడుతున్నారు.

సమయం ఇవ్వకుండా పరిశీలన ఎలా..?

కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షల సమయంలో దరఖాస్తులు స్వీకరించేటప్పుడు అనేక నిబంధనలు విధించి మోసం చేసింది. ఆ తర్వాత పరీక్షల సమయంలో అనేక లోటుపాట్లతో అభ్యర్థులకు ఇబ్బందులు సృష్టించారు. తీరా ఫలితాలు వచ్చాక సర్టిఫికెట్ల పరిశీలనప్పుడు మళ్లీ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఈ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి కూటమి ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులతో ఆడుకుంటోంది. ఈ నెల 24వ తేదీ రాత్రి వరకు ఎలాంటి కాల్ లెటర్లు ఇవ్వకుండా 25 వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ఆకస్మికంగా వెల్లడిస్తే ఎలా అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఒకరిద్దరు కాదు 1478 మంది అభ్యర్థుల సర్టిఫికెట్‌లను పరిశీలన చేయాల్సి ఉంటుంది. ఈ పరిశీలన అనేది చాలా కీలక ఘట్టం. కూటమి ప్రభుత్వం చేస్తున్న అనాలోచిత నిర్ణయాలపై ఆకస్మికంగా పరిశీలన ఉంటుందని తెలిపితే చాలా మంది అభ్యర్థులు సరైన సర్టిఫికెట్‌లు తెచ్చుకోలేని పరిస్థితి. దూరాభారం నుంచి చిత్తూరు జిల్లా కేంద్రానికి చేరుకోలేని పరిస్థితి. సమయం ఇవ్వకుండా...ఏ సర్టిఫికెట్‌లు తీసుకురావాలో చెప్పకుండా సర్టిఫికెట్‌ల పరిశీలన ఎలా అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

రెండు కేంద్రాల్లో పరిశీలన

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పరీక్షలు రాసి ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ మురకంబట్టు వద్ద ఉన్న అపోలో యూనివర్శిటీ, తిరుపతి రోడ్డులోని ఆర్‌వీఎస్ నగర్ వద్ద ఉన్న ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్‌ల పరిశీలన నిర్వహించనున్నారు. ఈ కేంద్రాల్లో పరిశీలనకు అవసరమైన ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చేపడుతున్నారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సర్టిఫికెట్‌ల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులు ఏ సర్టిఫికెట్‌లను పరిశీలనకు తీసుకురావాలి, ఎంత సమయానికి హాజరవ్వాలి అనే విషయం ఈనెల 24వ తేదీ రాత్రి వరకు వెల్లడించని దుస్థితి. దీంతో రాష్ట్ర విద్యాశాఖ అధికారుల వింత ధోరణి పై డీఎస్సీ అభ్యర్థులు పెదవి విరుస్తున్నారు.

అధికారులకు ఓరియెంటేషన్

సర్టిఫికెట్‌ల పరిశీలన విషయం పై విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వరరావును వివరణ కోరగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్‌ల పరిశీలనకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. రెండు ఇంజినీరింగ్ కళాశాలల్లో మౌలిక వసతులు, పరిశీలన చేసే బృందాల్లోని అధికారులకు ముందస్తుగా ఓరియెంటేషన్ ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర అధికారుల నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు సర్టిఫికెట్‌ల పరిశీలన నిర్వహిస్తామని సమాధానమిచ్చారు.

ఎప్పుడు రావాలో తెలియని దుస్థితి

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 1478 పోస్టులను మెగా డీఎస్సీ ప్రక్రియలో భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు మెరిట్ లిస్ట్ ఆధారంగా ఎంపికైన విద్యార్థులకు సమాచారం అందజేయాల్సి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్స్ వ్యక్తిగత లాగిన్‌లకు పంపుతామని ప్రకటించారు. అయితే ఈనెల 24వ తేదీ రాత్రి వరకు కాల్‌లెటర్‌లు అభ్యర్థులకు దరిచేరని దుస్థితి. ఒక వైపేమో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఈనెల 25వ తేదీన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన ఉంటుందని, సిద్ధంగా ఉండాలని మౌఖికంగా వెల్లడిస్తున్నారు. కానీ అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. ఆదివారం రాత్రి వరకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో డీఎస్సీ అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలు సర్టిఫికెట్‌ల పరిశీలన ఎప్పుడుంటుందో తెలియని దుస్థితిలో అభ్యర్థులు అయోమయానికి లోనవుతున్నారు.

గ్లోబల్ హెల్త్‌కేర్ క్యాపిటల్‌గా భారత్

– అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్ డా.ప్రతాప్ సి రెడ్డి



మాట్లాడుతున్న ప్రతాప్‌సి.రెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): భవిష్యత్తులో భారత్ ప్రపంచ హెల్త్‌కేర్ క్యాపిటల్‌గా అవతరిస్తుందని, ఇందు కోసం అపోలో యూనివర్సిటీ గొప్ప విజన్‌తో ముందడుగు వేస్తోందని అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్, అపోలో యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం చిత్తూరులోని అపోలో నాలెడ్జ్ సిటీలో విద్యార్థులు, అధ్యాపకులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా భారత వైద్యుల ఆధిపత్యాన్ని గుర్తు చేస్తూ.. అమెరికాలో దాదాపు 10 శాతం, యుకేలో 25–30 శాతం వరకు హెల్త్‌కేర్ రంగంలో భారత వైద్యులే కీలక స్థానాలు దక్కించుకున్నారని పేర్కొన్నారు.

తుమ్మలగుంటలో తుంబుర గణపతి



తిరుపతి రూరల్ : వినాయకచవితి పర్వదినం వస్తోందంటే చాలు.. అందరి కళ్లు తుమ్మలగుంట వైపు చూస్తుంటాయి. గత పాతికేళ్లుగా చెవిరెడ్డి కుటుంబీకులు విభిన్న ఆకృతులతో గణపతి ప్రతిమను తయారు చేయించి 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే 10 అడుగుల ఎత్తు, 7 అడుగుల వెడల్పుతో తుంబుర వినాయకుడి ప్రతిమను సిద్ధం చేయిస్తున్నారు. పరమేశ్వరుని ఒడిలో కూర్చుని తుంబుర చేతబట్టుకుని ధ్యానం చేస్తున్నట్టుగా గణేశుడి విగ్రహం కొలువుదీరనుంది. పర్యావరణ హితంగా చిట్టి, రాజ్ కుమార్ ఆధ్వర్యంలో 10 మంది కార్మికులు నాలుగు రోజులుగా శ్రమించి ప్రతిమను తీర్చిదిద్దారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 27వ తేదీ ఉదయం కల్యాణ వెంకన్న ఆలయంలోని కల్యాణ మండపంలో గణపతిని కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు.

క్లుప్తంగా

ఉర్దూలో మొదటి ర్యాంక్ సాధించిన జిలానీ



మహ్మద్ జిలానీ

రొంపిచెర్ల : డీఎస్సీ పరీక్షలో ఉర్దూ విభాగంలో రొంపిచెర్లకు చెందిన మహ్మద్ జిలానీ మొదటి ర్యాంక్ సాధించాడు. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని చిన్న మసీదు వీధికి చెందిన మహ్మద్ జిలానీ ఐదేళ్లుగా ప్రైవేటు టీచర్‌గా పని చేస్తున్నాడు. 100కు 68 మార్కులు సాధించి చిత్తూరు జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించాడు. డీఎస్సీలో ఉద్యోగం సాధించడం పై సంతోషం వ్యక్తం చేశారు.

డీఎస్సీలో సత్తా చాటిన దంపతులు



నిరుపమారాణి, జనార్దన్

బంగారుపాళెం : డీఎస్సీలో మండలానికి చెందిన భార్య, భర్త సత్తా చాటి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండలంలోని టేకుమంద గ్రామానికి చెందిన జనార్దన్, అతడి భార్య నిరూపమారాణి డీఎస్సీ ఫలితాల్లో ఆ దంపతులు ఉత్తీర్ణులైయ్యారు. జనార్దన్ ఎస్‌జీటీ విభాగంలో 85.1856 మార్కులతో 85వ స్థానంలో నిలిచారు. అతడి భార్య నిరూపమారాణి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు విభాగంలో 73.95 మార్కులతో 44వ స్థానంలో నిలిచారు. గ్రామానికి చెందిన దంపతులు ఇద్దరూ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

కుప్పం యువకుల ప్రతిభ



ప్రదీప్ కుమార్, రమేష్

కుప్పం : డీఎస్సీలో కుప్పం వాసులు జిల్లా స్థాయిలో ర్యాంక్‌లు సాధించారు. కుప్పం మండలం పైపాళ్యం గ్రామానికి చెందిన ప్రదీప్ కుమార్ డీఎస్సీ మెరిట్‌లో 93.79 గ్రేడ్ సాధించి జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో సాదించాడు. టెట్‌లో 150/150 మార్కులు సాధించాడు. డీఎస్సీ పరీక్షల్లో రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన మెరిట్‌లో జిల్లాలో రెండవ స్థానం సాధించాడు.

రామకుప్పంలో: రామకుప్పం మండలం పెద్దకురబలపల్లి గ్రామానికి చెందిన రమేష్ డీఎస్సీలో ప్రతిభ కనబరిచి డీఎస్సీ మెరిట్ 86.36 గ్రేడ్ సాధించారు.

అక్కాచెల్లెళ్లను వరించిన ఉద్యోగాలు



పుంగనూరులో ఉద్యోగాలు సాధించిన కుమార్తెలతో తల్లి గౌరమ్మ

పుంగనూరు : మండలంలోని వేపమాకులపల్లెకు చెందిన మునివెంకటప్ప , గౌరమ్మ దంపతులకు నలుగురు సంతానం. వీరిలో పెద్ద కుమార్తె వీణాకుమారి (2014లో ఉమెన్ పోలీస్), వాణి (2016లో ఎస్జీటీ), వనజాక్షి (2025 ఉమెన్ పోలీస్), ప్రస్తుతం శిరీష (2025లో ఎస్జీటీ)ను ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. వీరి కుటుంబ నేపథ్యం పరిశీలిస్తే తండ్రి పదేళ్లకు ముందే చనిపోయాడు. తల్లి దినసరి కూలీగా పనిచేస్తూ పెంచి, పెద్ద చేసి ఉన్నత చదువులు చదివించింది. ఒక తల్లిగా వారిని పోషించడమే అసాధ్యం. కానీ తల్లి పేరును , వంశం గౌరవాన్ని నిలిపిన నలుగురు కుమార్తెలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు పోలీస్, మరో ఇద్దరు ఉపాధ్యాయరాళ్లు కావడం విశేషం . వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

‘సిద్ధి’ వినాయకా..‘బుద్ధి’ ప్రదాయకా

- వరసిద్ధుడికి వెయ్యేళ్ల చరిత్ర
- సత్య ప్రమాణాలకు ప్రసిద్ధి
- 27 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు
- పూర్తవుతున్న ఏర్పాట్లు



ఊరేగింపులో స్వామి వారు (ఫైల్)

కాణిపాకం : సత్య ప్రమాణాలకు నెలవుగా.. అసత్యాలు చెబితే సింహ స్వప్నంగా కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రం బాసిల్లుతోంది. కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్యుడిగా పూజలందుకుంటున్నాడు. ఈ సిద్ధి, బుద్ధిని దర్శిస్తే.. విఘ్నాలు హరించి..సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఇంతటి మహత్యం కలిగిన వరసిద్ధి వినాయక దేవస్థానం 1000 ఏళ్ల చరిత్ర ఉంది. ఏటా ఈ క్షేత్రంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈనెల 27వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కాణిపాక ఆలయంపై ప్రత్యేక కథనం.

ఆలయ ప్రాశస్త్యం ఇదీ..

పూర్వం విహారపురి అనే గ్రామంలో ధర్మాచరణ పరాయణులైన ముగ్గురు గుడ్డి, మూగ, చెవిటి వాళ్లుగా జన్మించారు. కర్మఫలాన్ని అనుభవిస్తూ..వ్యవసాయే జీవనాధారంగా బతికేవారు. ఇక ఆ గ్రామాన్ని కరువు కాటకాలు చుట్టుముట్టాయి. గ్రామ జనానికి గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రయత్నంలో ఆ ముగ్గురు సోదరులు తమ పొలంలో ఉన్న ఏతం బావిని మరింత లోతుగా తవ్వాలనుకున్నారు. బావిని తవ్వే క్రమంలో ఓ పెద్ద బండరాయి అడ్డుపడింది. దాన్ని తొలగించే యత్నంలో పార రాయికి తగిలి రాయి నుంచి రక్తం చిమ్మింది. ఆ రక్తంతో తడిసిన ఆ ముగ్గురు సోదరులకు అంగ వైకల్యం మటు మాయమైంది. ఈ విషయం ఆ నోట..ఈనోట పడి..ఊరంతా తెలిసింది. ఈ విచిత్రం తెలుసుకున్న జనం ఆ స్థలానికి వచ్చి బావిని పూర్తిగా తవ్వి పరిశీలించింది. బావిలోని గణనాథుని రూపం చూసి భక్తి శ్రద్ధలతో పూజిస్తూ.. కొబ్బరికాయలు కొట్టారు. అలా స్వామివారి విగ్రహం వద్ద కొట్టిన కొబ్బరికాయల నుంచి వచ్చిన తీర్థం కాణి భూమి (కాణి అంటే ఎకరం పొలం అని అర్థం)లోకి పారింది. అప్పటి నుంచి విహారపురి గ్రామం కాణి పారకమ్ కాలక్రమేణా కాణిపాకంగా మారింది. ఇలా స్వామి వారు స్వయంభుగా వెలసి.. కోరిన కోర్కెలు తీర్చే గణనాథుడిగా భక్తుల చేత పూజలందుకుంటున్నాడు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీర్ణోద్ధరణ పనులు

కాణిపాకం ఆలయం సుమారు 1000 ఏళ్ల క్రితం నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.. చోళుల కాలంలో ఆలయం నిర్మితమైనట్లు పూర్వీకులు చెబుతున్నారు. 11వ శతాబ్దం..కుళతుంగ చోళ రాజు పరిపాలనలో ఆలయ నిర్మాణం జరిగినట్లు ఆధారాలున్నాయి. ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో (2011) ఆలయ జీర్ణోధరణకు నోచుకుంది.

తప్పుడు ప్రమాణాలు చేస్తే.. శిక్ష ఖాయం

సత్య ప్రమాణాలకు ఆరాధ్యుడిగా కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి వెలుగొందుతోంది. తప్పు చేసే వ్యక్తులను స్వామి సన్నిధిలో ప్రమాణం చేయిస్తే..ఆదిదేవుడే శిక్షిస్తాడని భక్తుల విశ్వాసం. వ్యసనాలకు బానిసలైన వారిని కూడా తీసుకొచ్చి ఇక్కడ ప్రమాణం చేయిస్తే..వాటికి దూరంగా ఉంటారని భక్తుల నమ్మకం. సవాల్..ప్రతి సవాల్‌ల్లో కూడా సత్య ప్రమాణాలకు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని ప్రతి ఒక్కరూ తలచుకుంటారు. దీంతో పాటు గణపతి హోమం, సంకటహర గణపతి వ్రతాలకు భక్తుల విశేషంగా కొలుస్తారు.

సేవలు ఇలా..

తేదీ	పగలు సేవలు	రాత్రి సేవలు
27	వినాయకచవితి	గ్రామోత్సవం
28	ధ్వజారోహణం	హంసవాహనం
29	నెమలివాహనం	బంగారు నెమలివాహనం
30	-	మూషిక వాహనం
31	బంగారు చిన్నశేషవాహనం	బంగారు పెద్దశేషవాహనం
1-09	చిలుక వాహనం	వృషభవాహనం
02	-	గజవాహనం
03	రథోత్సవం	-
04	బిక్షాండి	తిరుకల్యాణం,అశ్వవాహనం
05	ధ్వజారోహణం	ఏకాంత సేవ, వడాయత్తు ఉత్సవం

27 నుంచి బ్రహ్మోత్సవాలు

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ప్రతి రోజు స్వామి వారు వివిధ వాహన సేవల్లో దర్శనమివ్వనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దీపాలంకరణతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పెయింటింగ్ పనులను పూర్తి చేశారు. పుష్పాలంకరణ, అన్నదానం, ప్రసాదం, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తుల వసతులు తదితర అంశాలపై ముందస్తు చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు అభిషేకం, స్వామి దర్శనం, ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరగనుంది.

ప్రత్యేక ఉత్సవాలు

తేది	వాహనసేవ	తేది	వాహనసేవ
06-09-2025	అధికార నంది వాహనం	12	విమానోత్సవం
07	రావణ బ్రహ్మవాహనం	13	పుష్పపల్లకీ
08	యాళి వాహనం	14	కామధేను వాహనం
09	సూర్యప్రభ వాహనం	15	పూలంగిసేవ
10	చంద్రప్రభ వాహనం	16	తెప్పోత్సవం
11	కల్పవృక్ష వాహనం		

గీత కార్మికుడి వైన్‌షాపుపై దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పుత్తూరు పరిధిలోని కార్వేటి నగరం మార్గంలో కల్యాణపురం వద్ద కల్లుగీత కార్మికుడి మద్యం దుకాణంపై లక్కీ డిప్ ద్వారా వైన్‌షాప్ దక్కించుకున్న నిర్వాహకుడు దాడికి పాల్పడ్డాడు. కరెంట్ కట్ చేసి దౌర్జన్యం చేశాడు. బాధితుడు మీడియాతో మాట్లాడుతూ కల్లుగీత కార్మికుడిగా వైన్ షాపును దక్కించుకున్నామన్నారు. అప్పటి నుంచి బెదిరింపులు వస్తున్నాయని వెల్లడించారు. టీడీపీ అండ ఉందని లక్కీడిప్ ద్వారా వైన్ షాపు దక్కించుకున్న నిర్వాహకుడు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నాడని ఆరోపించాడు. షాపు పెట్టనివ్వకుండా ఇబ్బంది పెట్టాడని, అధికారులు చూపించిన స్థలంలో దుకాణం ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక అప్పటి నుంచి షాపు నిర్వహించుకోకుండా నానా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 5 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 83,858 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,034 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.93 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 5 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్టు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.

అర్చకుల పేరుతో ఘరానా మోసం



ఎర్ర మార్కులోని వారు కాణిపాకం, మిగతా ఇద్దరు తిరుత్తణి ఆలయ పూజారులుగా చెప్పకున్న వ్యక్తులు

శాంతిపురం : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి, తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయ పూజారుల పేరుతో వచ్చి ప్రజల భక్తిని సొమ్ము చేసుకునే ముఠా సులువుగా లక్షలు దోచుకుంటోంది. ఆలయాల పవిత్రత, భక్తుల నమ్మకాలను దెబ్బతీసేలా ఓ ముఠా దందా సాగిస్తోంది.

మీ ఇంట్లోకి రావచ్చా...

అకస్మాత్తుగా ఇంటి ముందుకు ఓ ఐదుగురు పురోహితులు వచ్చి ‘మీ ఇంట్లోకి రావచ్చా’ అని అడుగుతారు. స్వాములు వచ్చారని లోనికి రమ్మనగానే అందరూ ఒక్కసారిగా ఏవో మంత్రాలు చెబుతూ ఇంట్లోకి వస్తారు. మంత్రాలను కొనసాగిస్తూ పూజ తట్ట తీసుకురమ్మని అందులోకి విభూది, కుంకుమ, నాలుగు పూలు వేసి ఇంట్లో వాళ్ల చేతిలో పెడతారు. తమలో ముగ్గురు కాణిపాకం ఆలయ అర్చకులమని, మరో ఇద్దరు తిరుత్తణి ఆలయ అర్చకులమని పరిచయం చేసుకుంటారు. భగవంతుడి నిర్దేశం మేరకు ఆ ఇంటికి వచ్చామని, ఇకపై అన్నీ శుభాలే కలుగుతాయని చెబుతారు. వినాయకచవితి సందర్భంగా కాణిపాకంలో పెద్ద ఎత్తున అన్నదానం చేసేందుకు మీ కుటుంబం తరపున రూ 5,116కు తక్కువ కాకుండా నగదు రూపంలో విరాళం ఇవ్వాలని కోరతారు. తమకు సమయం లేదని వెంటనే నగదు ఇస్తే త్వరగా వెళ్లాలని హడావుడి చేస్తారు. ఆ ఇంట్లో వారు డబ్బు ఇవ్వగానే వీడ్కోలు పలికి క్షణాల్లో మరో ఇంటికి, మరో గ్రామానికి వెళ్లిపోతారు. పురోహితుల వేషధారణలోని వారు కారులో గ్రామంలోకి రాగానే అక్కడ స్థితిమంతులు, దైవ కార్యాలకు ఖర్చు చేసే పుణ్యాత్ములు ఎవరని స్థానికులను ఆరా తీసి ఆ ఇంటిని ఎంచుకొంటున్నారు.

రూ.లక్ష బురిడీ

నల్లరాళ్లపల్లి, చొడంపల్లి, ఎం.శాంతంపల్లి, గంగతిమ్మనపల్లి, దండికుప్పం తదితర గ్రామాల్లో ఆదివారం ఉదయం వీరు జనాన్ని బురిడీ కొట్టించారు. ఉదయమే ఈ ప్రాంతంలో దాదాపుగా లక్ష రూపాయలకు పైగా వసూళ్లకు పాల్పడ్డారు. ఈ స్వాముల వ్యవహారాన్ని సందేహించిన ఓ బాధితుడు వీరిని ఫొటో తీసి కాణిపాకం , తిరుత్తణి మురుగన్ ఆలయ అధికారులను ఆరా తీయడంతో వారు నకిలీలుగా తేలింది. దీంతో దండికుప్పంలో ఉన్న వారిని గుర్తించి పోలీసులకు అప్పగించే ప్రయత్నం చేయడంతో కాళ్లావేళ్లా పడి సొమ్మును వెనక్కి ఇచ్చిన అక్కడి నుంచి బయటపడ్డారు. కాగా గత ఏడాది దసరా సమయంలో కూడా ఇదే ముఠా ఆలయ నిర్మాణం పేరుతో వచ్చి వసూళ్లు చేసిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్ సిబ్బందితో పాటు రామకుప్పం పోలీసులను అప్రమత్తం చేసి గాలింపు చేపట్టారు. అయితే పురోహితుల పేరిట వచ్చిన వారు అప్పటికే ఉడాయించారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆలస్యం చేయకుండా అనుమానితుల సమాచారం పోలీసులకు తెలపాలని ఎస్‌ఐ కోరారు.

పట్టపగలు ఇంట్లో చోరీ



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

శ్రీరంగరాజపురం : పట్ట పగలే దొంగతనం జరిగిన సంఘటన మండలంలోని గంగమ్మగుడి వడ్డి ఇండ్లు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వడ్డిఇండ్లు గ్రామానికి చెందిన చిట్టిబాబునాయుడు కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం కావడి ఎత్తుకొని తిరుత్తణికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకొని దొంగలు ఇంటిలోకి చొరబడి 40 గ్రాముల బంగారం, కేజీ వెండి, 30 వేల రూపాయల నగదు చోరీ చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. గ్రామాల్లో ఎవరైన అనుమానితులుగా కనబడితే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

ఐఐటీ విద్యార్థులకు ఇంటరాక్టివ్ సెషన్

ఏర్పేడు: తిరుపతి ఐఐటీలో మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాల విభాగం సంయుక్తంగా గుజరాత్‌లోని వడోదర ఎంపీ డాక్టర్ హేమాంగ్ జోషితో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీపై విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ప్రజాస్వామ్యం, పాలన, ప్రజా విధానం డైనమిక్స్‌పై చర్చలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, విధాన ఔత్సాహికులకు సూచనలు ఇచ్చారు. ఐఐటీ డైరెక్టర్-ఇన్-చార్జ్ ప్రొఫెసర్ శశిధర్ గుమ్మా పాల్గొని యువతకు సాధికారత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపిందని కొనియాడారు.

‘తెలుగు’ వెలుగుకు చర్యలు చేపట్టాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : మహాసంకల్ప దీక్షతోనే ‘తెలుగు ప్రాభవం’ సాధ్యమని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సి.నారాయణస్వామి, ఎం.వి. కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని సమాఖ్య కార్యాలయంలో ప్రముఖ సాహితీ వేత్త మన్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో ‘తెలుగు ప్రాభవం’పై జాతీయ కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు భాషాభివృద్ధి పరిరక్షణ ఉద్యమాలతోనే సాధ్యమన్నారు. ప్రముఖ రచయితలు నందిపాటి చక్రపాణి, కొఠారి వెంకటరత్నం, ఆర్. ఎస్. రాజన్ మాట్లాడుతూ.. భాష నశిస్తే, జాతి నశిస్తుందని తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాల్సి ఉందన్నారు. ప్రముఖ సాహితీకారులు శాంత కుమారి, తోట గోవిందన్, కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పోస్ట్ డాక్టోరల్ బి. చక్రవర్తి మాట్లాడుతూ.. తెలుగుకు వెలుగులీనేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోతే తెలుగు కేవలం ఒక గిరిజన భాషలాగా వినికిడి భాషగా మాత్రమే మిగిలిపోయే ప్రమాదం లేకపోలేదన్నారు. ఆ అనంతరం 30 మంది రచయితలకు, సంఘసేవకులకు ‘తెలుగు తల్లి’ జాతీయ పురస్కారాలు 2025ను ప్రముఖ సాహితీవేత్త మన్రిపూడి దేవేంద్రరావు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రచయితలు పాలకూరు కన్నయ్య, ఎం. శ్రీరాజు, ఎం.కన్నయ్య నాయుడు, యవన్య, మిట్టా లక్ష్మి, తాళ్ళపాక వరలక్ష్మమ్మ, వి.రఘుపతి, ఎస్. భావన, టి.ఎస్. ప్రవళిక, ఎస్. లిఖిత, జ్ఞాశ్రిత, సంఘ సేవకులు కోటీశ్వర మొదలియార్, రోహిత్ కుమార్, మురళి, ఎస్.ఖాదర్ బాషా పాల్గొన్నారు.

కిక్కిరిసిన బోయకొండ



ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆదివారం కావడంతో విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకొన్నారు.

ఆశచూపి దోచేశారు!

- అవని కోఆపరేటివ్ సొసైటీ సంస్థ మోసం
- లబోదిబోమంటున్న బాధితులు





సంస్థకు నగదు చెల్లించిన పాసు పుస్తకాలు, ఖాతాదారులకు సంస్థ ఇచ్చిన బాండ్లు

చౌడేపల్లె: కష్టపడి సంపాదించిన సొమ్ములో ఎంతో కొంత దాచుకోవాలని ఆశపడ్డారు. దాచుకొన్న డబ్బును వృద్ధాప్యంలో అవసరమైనప్పుడు ఉపయోగపడుతుందన్న ఆశతో అవని కోఆపరేటివ్ సొసైటీ సంస్థలో దాచుకున్నారు. అయితే ఆ సంస్థ వారి డబ్బును దోచేసింది. ఈ విషయం గుర్తించిన బాధితులు ఏళ్ల తరబడి న్యాయం కోసం అధికారులు, పోలీసులకు విన్నవించినా వారు కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, పుంగనూరు, బి.కొత్తకోట, గుర్రం కొండ, పలమనేరు, బంగారుపాళెం, పాకాల, పీలేరు తదితర ప్రాంతాల్లో 2014లో ఏజీఎస్ పరివార్ మ్యాచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పేరుతో చిన్న ప్రైవేటు బ్యాంకును ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో భవనాలను అద్దెకు తీసుకుని బ్యాంకు శాఖల ఏర్పాటుతో పాటు సిబ్బందిని నియమించి గ్రామాల్లో పరిచయం ఉన్న వారితో ఖాతాలను తెరిపించారు. వారికి ఆశ చూపి తమ బ్రాంచిలో అనేక లబ్ధి పొందే పథకాలున్నాయని, చదువులేని, పేదలకు ఆశచూపారు. తమ వద్ద పెన్షన్ ప్లాన్, చిల్డ్రన్స్ ప్లాన్, రోజువారీ ఖాతా, నెలవారీ ఖాతా , సేవింగ్స్ ఖాతా, ఆర్డీ తదితర సేవలున్నాయని గ్రామీణ ప్రాంతాల్లో స్థానికులను పరిచయం చేసుకుని, ఏజెంట్ల ద్వారా భారీగా నగదు వసూలు చేశారు.

20 వేల మందికి పైగా ఖాతాదారులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ సంస్థలో సుమారు 20 వేల మందికి పైగా ప్రజలు ఖాతాలు ప్రారంభించారు. వారి నుంచి డిపాజిట్‌లను సేకరించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు, చిన్నపాటి వ్యాపారుల నుంచి వారి ఆర్థిక పరిస్థితి ఆధారంగా రోజుకు రూ.100 నుంచి రూ.1500 వరకు ఏజెంట్లతో నగదు వసూలు చేయించారు. రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకు గడువు విధించారు. గడువు తీరిన ఖాతాదారులకు అదనంగా 12 శాతం వడ్డీతో కలిపి తిరిగి సొమ్ము చెల్లించేలా నింబంధనలు పెట్టి టోకరా వేశారు.

రూ.50 కోట్లకు పైగా దోచేశారు

ఖాతాదారుల నుంచి డిపాజిట్లు రూపంలో సుమారు రూ.50 కోట్లకు పైగా దోచేశారని బాధితులు తెలిపారు. కష్టపడి సంపాదించిన నగదు డిపాజిట్ల రూపంలో పరుల పాలైందని గుర్తించిన లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో లబోదిబో మంటూ బోరున విలపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టాలి.

బాండ్లు చూపి మోసం చేశారు



నేను చెల్లించిన రూ.లక్ష నగదుకు బాండ్లు ఇచ్చారని, అధిక మొత్తం చెల్లిస్తామని చెప్పడంతోపాటు, తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ సంస్థలో పనిచేస్తూ నన్ను నమ్మించడంతో మోసపోయాను. కూలీ చేసి పోగు చేసుకున్న డబ్బు చెల్లించాను. ఆడ బిడ్డల కోసం దాచుకున్న సొమ్ము పరులపాలు కాకుండా మాకు ఇప్పించండి.

– రమణారెడ్డి, పెద్దకొండామర్రి

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



సంస్థ ద్వారా పేదలందరూ మోసపోయాని పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మా డబ్బును గద్దల్లా తన్నుకుపోయారు. వారితో పాటు డబ్బులు చెల్లిస్తామని చెప్పిన అధికారులందరూ బదిలీ అయ్యారు. ఇకనైనా ఈ ప్రభుత్వంలో మాకు న్యాయం జరుగుతుందన్న ఆశతో బతుకుతున్నాం.

– సుదర్శన్, పుంగనూరు

చెక్ ఇచ్చారు..డబ్బులు ఎగ్గొట్టారు



రోజంతా కష్టపడితే రూ.200 కూలీ ఇస్తారు. నెలకు రూ.వెయ్యి చొప్పున సంస్థకు చెల్లించాను. వృద్ధాప్యంలో అవసరాలకు వాడుకోవచ్చని ఆశపడి కట్టారు. గడువు తీరిందని తెలిపితే నాకు ఒక చెక్కు ఇచ్చారు. బ్యాంకుకెళ్లితే డబ్బులు ఇవ్వలేదు. సంస్థ కార్యాలయం వద్దకు వెళ్లితే సమాధానం చెప్పేవారు కూడా లేరు.

– సాకమ్మ, పెద్దకొండామర్రి

ఏమిచేయాలో దిక్కుతోచడంలేదు



వృద్ధాప్యంలో ప్రభుత్వం నాకు ఇచ్చే పింఛన్ డబ్బును అవని కోఆపరేటివ్ సొసైటీలో కట్టాను. నేను కట్టిన డబ్బును మోసం చేసి కాజేశారని తెలిసి కుమిలిపోతున్నాను. నా లాంటి పేదలను ఇలా మోసం చేయడం తగదు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. మీరైనా న్యాయం చేయండి.

– లక్ష్మమ్మ, పెద్దకొండామర్రి